# సాహసి

**ఈ** సంఘం ఎప్పుడిట్లా కావటం మొదలుపెట్టిందో తెలియదు. ముట్టుకుంటే కచ్చికలాగు పొడిపొడి కావటానికి సిద్ధంగా ఉంది ఈ మన సంఘం. ప్రతి ఇద్దరు మనుష్యుల మధ్యా కనిపించని గోడలున్నవి. ఒకరిని గురించి ఒకరు పూర్తిగా తెలుసుకో ప్రయత్నించటం పెద్దమనిషి తరహాకాదు. ఒకవేళ ఒకరి లోపాలు ఒకరికి తెలిసినా అవి తెలియనట్టు నటించటం నాగరికత. వాటిని బయటపెట్టినవాడు శుద్ధ పల్లెటూరు మొరటుమనిషి.

మనలను గురించి లోకం తెలుసుకుంటుందని ఎప్పుడు భయపడటం ప్రారంభించామో ఆనాడు మనము లోకంలో వాళ్ళను గురించి తెలుసుకోకుండా ఉండటం మర్యాదకరమైన పనిగా చూస్తాం. మనిషికీ మనిషికీ మధ్య దాటరాని అగడ్తలు. ఎవరి నాలుగుగోడల మధ్య వారు ఎంత అవినీతికరంగానైనా ప్రవర్తించవచ్చును! ఇక ఈ సంఘం ముట్టుకుంటే కచ్చిక రాలినట్టు రాలక ఏమవుతుందీ?

కేవలమూ వ్యక్తిగతమైన లోపాలు అట్లా ఉంచి సంఘానికే తలవంపులు తెచ్చిపెట్టే పనులు చేస్తారు కొందరు. వారాపని చేస్తుంటే అనేక వందలమంది చూసి ఊరుకుంటారు. చాటుగా అటువంటి పనిచేసినవాణ్ణి తిట్టుకుంటారు. నా అభిప్రాయంలో వారంతా ఆ పనికి అనుమోదకులే. వారిలో ఎవరికీ సంఘబుద్ధి అనేది లేదు. వారివల్ల సంఘానికి ఈషణ్మాత్రం ప్రయోజనం లేదు. నూటికి తొంభైతొమ్మిది మంది అట్లా ఉండటం కూడా నాకంత విచిత్రంగా తోచదు. కాని ఎవడైనా సాహసించి ఆ దుష్కార్యం తలపెట్టిన వాణ్ణి నిలవదీసి "నువ్వీపని ఎందుకు చేస్తున్నావు? నీకిది తగదు. నిన్ను నేనీ పని చెయ్యనివ్వను!" అని అనగలిగితే మిగిలిన వారు ఆ సాహసికి సాయం రాకపోగా వారిమీద తలా ఒక రాయీ వెయ్యటం జరిగినప్పుడు, "ఈ సంఘానికి ముక్తి ఉందా?" అనిపిస్తుంది.

మా పార్వతీశం మామయ్యకు జరిగిన అనుభవం అందరూ వినితీరవలసిందే. మా మామయ్య పెద్ద సంఘసంస్కర్త అని కాని, ఈ సంఘం ఎట్లా బాగుపడుతుందా అని ఆయన ఈహోరాత్రులు చింతించాడని కాని మీరు ఒక్కనాటికి అనుకోవద్దు. ఆయనకు సామాన్యంగా ఏ విషయమూ పట్టినట్టుండేది కాదు. ఎవరిజోలీ అక్కర్లేనట్టుండేవాడాయన. కాని నేను ఆయన్ను బాగా ఎరుగుదును కనుక చెప్తున్నాను, ఎవరు ఏ విధమైన

సాంఘిక అత్యాచారం చేసినట్టు విన్నా ఆయన లోలోపల అగ్నిపర్వతం మాదిరిగా కుమిలిపొయ్యేవాడు. ఆయన పూర్వాచారాపరాయణుడూ కాడు, అధునాతనుడూ కాడు.

"ఏం మామయ్య, నీకు ఇప్పటిపద్ధతు లిష్టమా వెనకటిపద్ధతులిష్టమా?" అని నేనంటే, "ఇదేమయినా మతముట్రా, అబ్బాయి? వ్యక్తులకూ వారి ద్వారా దేశానికీ ఏది క్షేమమో కాస్త బుర్ర ఉన్న వాడికి సులభంగా తెలిసిపోతుందే! దీనికిన్ని పేర్లెందుకూ?" అనేవాడు.

"ఆ దేశ క్షేమాన్ని గురించే రెండురకాల అభిప్రాయాలుండవచ్చునుగా?" అని నేనంటే, "ఎబ్బే! ఏది ఎట్లా జరగాలో దాదాపు అందరికీ తెలుసు. అయితే ఏమిటంటే ఒక పద్యం మనం అర్థం చేసుకోవటమూ దాని అర్థం మరొకరికి చెప్పగలగటమూ ఒకటికానట్టే, దేశ క్షేమానికి ఏమేమిచేస్తే బాగుంటుందో అది జరిగేటట్టు చెయ్యటం అందరివల్లా కాదు. దానికి నిజమైన నాయకుడు కావాలి. పైగా మరొక చిక్కేమిటంటే ఈ మానవ హృదయాలను భయమనేది పూర్తిగా ఆవేశించి ఉండటంవల్ల ఈ కక్షలు. కొందరికి కొత్త పద్ధతులంటే భయం. అందుకని వారు సనాతనులు. మరి కొందరికి కొత్త పద్ధతులు ఆమోదించక పోవటానికి భయం. వారు అధునాతనులు. నా వంటివాడు తన హృదయాన్నీ మెదడునూ అనుసరించి వెళ్ళుతూ వుంటే 'గోడమీదిపిల్లి' అని వాడికి పేరు పెట్టేస్తారు" అనేవాడు.

మా మామయ్య మంచి నియమాలు కలవాడు. ఆయన శరీరం వజ్రశరీరం. రోజూ ఉదయమే లేచి కుస్తీకి తయారవుతున్న వాడల్లే ఎక్సర్‌సైజు చేసేవాడు. మేము కుర్రవాళ్ళం తుమ్మినా దగ్గినా ఆయన నవ్వేవాడు. ఆహారం కూడా మితంగానూ వంటికి ఆరోగ్యవంతంగానూ తినేవాడు. ఒకసారి ఉద్రేకంలో ఆయన మాదిరిగానే అలవాట్లు చేసుకుందామని ప్రయత్నంచేసి వారం రోజులు కూడా నెగ్గించుకోలేకపోయినాను.

"ఉత్త ఆవేశంతో పనులుగావురా, నాయనా. నియమం అనగానే దీక్ష కావాలి. పొద్దున్నేలేచి అరగ్లాసెడు చల్లని నీళ్ళు తాగటానిక్కూడా దీక్ష కావాలి. ముందు మనస్సును నియమించగలిగితే ఆ తరవాత నువు నీ శరీరాన్ని నియమించకుండా ఉండలేవు. అసంభవం. అప్పుడు నీకు ఆరోగ్యమూ బలమూ తప్పనిసరిగా కావలసివస్తై" అని ఆయన నాతో అన్నాడు.

నిజంగా ఆయన మనస్సూ అటువంటిదే. ఇంకొకరి మనస్సు ఇటువంటిదీ అని చెప్పరావటం సాహసమే కాని, ఆయన ఎన్నడూ నీచమైన ఆలోచన చేసేవాడుకాడనీ, ఆయన శరీరం ఎంత దృఢంగానూ ఆరోగ్యవంతంగానూ ఉండేదో మనస్సు కూడా అంత దృఢంగా, ఆరోగ్యవంతంగా ఉండేదనీ నా సంపూర్ణ విశ్వాసం. ఆయన ఎంత బలంగలవాడో, అంత ధైర్యం గలవాడు. ఆ బలాన్ని ఎంత ప్రకటించుకునేవాడో ధైర్యాన్ని అంతే ప్రకటించుకునేవాడు.

ఆయన్ను గురించి ఇంత విపులంగా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, ఆయన కుమారుడు రాజేశ్వర్రావు అవివేకం వల్ల ఆయన చాలా అపఖ్యాతి పాలయినాడు. ఆయనమీద రాళ్ళురువ్విన వాళ్ళల్లో ఒక్కరు కూడా ఆయన్ను సరిగా ఎరగరు. ఆయన్ను గురించి ఇంత విపులంగా చెప్పకుండా ఆయనకు జరిగిన అనుభవం మాత్రమే చెప్పి ఆయనయందు లోకానికి నమ్మకం కలిగేటట్టు చెయ్యలేను.

రాజేశ్వర్రావును గురించి సంగ్రహంగా ఒక్క ముక్కలో చెప్పాలంటే, వాడు తల్లిపోలిక – అన్ని విషయాల్లోనూ! వాడిది చిన్నప్పటినుంచీ వక్రబుద్ధి. ఏ విషయంలోనూ సూటిగా వెళ్ళేదికాదు, అదేం ఖర్మమో! వాడు పిరికి – అమిత స్వల్ప విషయాలలో కూడా అబద్ధాలాడేవాడు. నిజం చెప్పటం ఎప్పుడూ అపాయకరం అనే వాడి విశ్వాసం. అమిత తిండిపోత- వాడిది అనారోగ్యంతో కూడుకున్న ద్వంద్వ శరీరం. చిన్నప్పటినుంచీ వాణ్ణి చూస్తే నాకు ఒకందుకు చెడ్డకోపంగా ఉండేది. వాడి దౌర్బల్యం వాడికి తెలిసి కూడా సిగ్గుపడేవాడు కాదు. మీదుమిక్కిలి వాడికున్న దుర్గుణాలన్నీ అందరికీ ఉన్నవని వాడికి గట్టినమ్మకం. అందరూ భోజన ప్రియులనే, అందరూ అబద్ధాలాడేవాళ్ళనే, ప్రతిరోజూ స్నానం చెయ్యటం అందరికీ అసహ్యమనే. కాస్త పెద్దయి వాడిబుద్ధి వికసించటం మొదలుపెట్టిన తరవాత ఇంకొక థియరీ బయటపెట్టాడు వాడు. తను చేస్తున్న పాడు పనులన్నీ అందరికీ చెయ్యాలనే ఉంటుందిట – సిగిరెట్లు కాల్చాలనీ, ఎప్పుడైనా కాస్త బీరుతాగి రావాలనీ, అప్పుడప్పుడూ సానియిళ్ళకు వెళ్ళి రావాలనీ! అయితే మేమంతా మూఢనమ్మకాలను పట్టుకుని ఆ పనులు చెయ్యటానికి జంకుతున్నామట. వాడు ధీరుడై జంకులేకుండా ఆ పనులన్నీ చేసి వేస్తున్నాడట!

"మా వాణ్ణి తల్లిపాడు చేసిందని కొంతకాలం అభిప్రాయపడ్డాను. కాని తరవాత తరవాత నాకా అభిప్రాయం మారిపోయింది. నా స్నేహితుడి కుమార్తెను ఒకతెను కొంతకాలం కిందట తలవని తలంపుగా చూశాను. ఆ పిల్లను చాలా పసిదానప్పుడు, నా స్నేహితుడు కొద్దిరోజుల్లో చనిపోతాడనగా చూశాను. వాడు పోయిన తరవాత వాడి భార్య ఆ పిల్లను తన అత్తవారింటివైపు వారితో ఎటువంటి సంబంధమూ లేకుండా పెంచింది. కాని తీరా నేను చూడవచ్చే సమయానికి ఆ పిల్ల అచ్చు మా స్నేహితుడల్లేనే తయారయి ఉన్నది – గుణగణాల్లో కూడా. ఎన్నడూ చూడని తన తండ్రివైపు వాళ్ళమీద దానికెంతో అభిమానం. తల్లి యొక్క వెలితి ఆలోచనలూ, నిస్సారమైన హృదయమూ ఆ పిల్లకే కోశానా లేవు!" అని ఒకసారి మా మామయ్య నాతో అన్నాడు. తన కొడుకు రాజేశ్వర్రావును గురించి చెబుతూ.

ఇక ఈ ప్రస్తావనలు చాలించి అసలు విషయానికి వస్తాను.

రాజేశ్వర్రావుకు పదిహేడేళ్ళప్పుడు మా మామయ్య వాడి వివాహం చేశాడు. ఆయనకు కుమారుడిమీద ఈషణ్మాత్రమయినా అభిమానం లేకపోయినప్పటికీ, అభిమానం ఉంటే ఎంత శ్రమపడి ఉండేవాడో అంత శ్రమపడి వాడికి అన్ని విధాలా లక్షణవతి అయిన భార్యను సంపాదించిపెట్టాడు.

పెళ్ళి అయిన సంవత్సరానికే ఆయనకు పశ్చాత్తాపం కలిగేటట్టు ప్రవర్తించటం మొదలుపెట్టాడు రాజేశ్వర్రావు. వాడు పెళ్ళి అయిననాటినించీ మామగారిమీద సన్న సన్నగా దాష్టీకం చెయ్యటం సాగించాడు. మొదట మా మామయ్య చూసీచూడనట్టు ఊరుకున్నాడు. కాని రాజేశ్వర్రావు ప్రవర్తన నానాటికీ దుర్భరమయింది.

వాడితో ముఖాముఖీ వాడి లోపాలన్నీ తర్కించటంలో మా మామయ్య పెద్ద పొరపాటు చేశాడేమో అనుకుంటాను. ఆనాటినించీ వాడికి తండ్రిమీద ఏమూలో ఉంటూ వచ్చిన బెదురుకాస్తా పోయింది.

"నీ అంత అవివేకిని, పొగరుబోతును, అసమర్థుణ్ణి, అజ్ఞానిని, అవినీతిపరుణ్ణి, సిగ్గులేనివాణ్ణి నేనెక్కడా చూడలేదు. నిన్ను గురించీ నీ గొప్పతనాన్ని గురించీ గర్వించటం మాని నువు ప్రపంచాన్నీ మనుష్యులనూ గురించి అర్థం చేసుకోవటం నేర్చుకోకపోతే బాగుపడవు!" అని మా మామయ్య అన్న మాటల్లో సత్యం లేకపోలేదు. అయితే ఈ లోకంలో నిజం ఎవడిక్కావాలి? మా రాజేశ్వర్రావుకు అసలెందుకు?

వాడు తండ్రికి ఘాటుగానే జవాబు చెప్పాడు. వాడి సమాధానం విని మా మామయ్య నేనెన్నడూ నా జన్మలో మరవలేని ముక్క ఒక్కటే అన్నాడు.

"నిన్ను నేను అదుపు చెయ్యటం మానేసి చాలాకాలం అయింది. నీ లోపాలు నీకు విప్పి చెప్పటం నాకు ఎంత బాధ కలిగించిందో నువ్వూహించలేదు. కాని నేనా బాధ నిష్కారణంగా పడ్డవాణ్ణయినానని గ్రహించాను. ఇక ఈ విషయం నీతో ఎత్తను!"

ఈ చిన్న ఘర్షణ జరిగినప్పుడు నేనక్కడే ఉన్నాను. అంత వరకూ ఎన్నడూ నేనా తండ్రి కొడుకులను చూసి అంత ఆశ్చర్యపడలేదు. మంచి యవ్వనంలో ఉన్నట్టు కనిపిస్తున్న ఆ నలభై ఏళ్ళ తండ్రి, జుట్టు నెరసి, పొట్ట పెంచుకుని సుఖ రోగాలతో తీసుకోవటం కూడా ప్రారంభించిన ఆ కొడుకూ! వాణ్ణి కొడుకని చెప్పుకోటానికి ఆ తండ్రి ఎంత సిగ్గుపడుతూ ఉండి ఉండవచ్చును!

తన భార్య రజస్వలయిందని తెలిసిన నాటినుంచీ రాజేశ్వర్రావు తన భార్యను కాపరానికి తెచ్చుకోవటాన్ని గురించి ఆలోచించటం మొదలుపెట్టాడట. ఆ రోజుల్లో వాడితో మాట్లాడటం తటస్థించిన ప్రతివాడికీ వాడు భార్యను కాపరానికి తెచ్చుకోటం గురించి వివరాలు వినలేక తలపట్టి పోయినట్టు తెలుస్తుంది.

ఎవరి సానుభూతీ పొందలేనివాడై రాజేశ్వర్రావు చివరకు మామగారికే ఉత్తరం

రాశాడు. తన భార్యను పంపటానికి వీలయ్యేదీ లేందీ తెలపమని. దానికిప్పుడే ఏమంత తొందర అనీ, ఆ విషయాలు తానూ తన వియ్యంకుడూ సంప్రదించుకుని ఏర్పాటు చెయ్యటం భావ్యంగా ఉంటుందేమోనని రాజేశ్వర్రావుకు మామగారు సమాధానం రాశాడు. ఇంకొకరి సహాయం అవసరం లేకుండానే తన భార్యతో కాపరం చేసే జ్ఞానమూ అనుభవమూ తనకు కలిగినవని ధైర్యం చెబుతూ రాజేశ్వర్రావు మామగారికి మళ్ళీ రాశాడు. దానికి మామగారు మౌనంగా ఊరుకున్నాడు.

రాజేశ్వర్రావు తనకు చాలా గొప్ప పరాభవం జరిగిందని ఊహించుకుని వెళ్ళి తండ్రితో కలియబడ్డాడు.

"నువు నీ భార్యను ఎప్పుడు కాపరానికి తెచ్చుకున్నా నా అభ్యంతరం లేదుకాని కనీసం నీ వళ్ళు బాగు చేయించుకునేదాకానైనా నువు తొందరపడి లాభం లేదనుకుంటాను" అన్నాడు మా మామయ్య.

తన శరీరం బాగు చేసుకోవటం యొక్క ఆవశ్యకత రాజేశ్వర్రావుకు గోచరించినట్టు లేదు. తండ్రి అన్నట్టే ఎవరో స్నేహితులుకూడా అంటే రాజేశ్వర్రావు తను ఒళ్ళు బాగు చేయించుకోవటంలో అర్థం లేదనీ, తను ఎట్లాగూ తన స్నేహితురాళ్ళతో బాంధవ్యం భార్యకోసం వదులుకోబోవటం లేదనీ అన్నాడట.

"అందుకని నీ భార్యనుకూడా చెడగొట్టుతావా?" అని వాళ్ళడిగితే "ఎట్లాగూ తప్పనిదానికి చేసేదేముందీ? నేను చెడిపోలేదా? నేను ఒకప్పుడు అందరిమల్లే ఉన్నవాణ్ణి కానా? నాతోపాటు నా భార్యానూ! అగ్నిహోత్రుడి ఎదట పెట్టుకున్న ఒట్లన్నీ ఏమిటి?" అని వాడు చాలా యుక్తిగా వాదించాడట.

తన తండ్రివల్ల తనకేమీ కాదనీ, తను మామగారికి ఇక ఏమాత్రమూ అలుసు ఇవ్వరాదనీ నిశ్చయించుకుని రాజేశ్వర్రావు మామగారి యింటికి బయలుదేరి వెళ్ళి, ఆయనతో పెద్ద పోట్లాట పోట్లాడి – ఆ వింత చూడటానికి దాదాపు వందమంది వచ్చారట! – ఆఖరుకు తన పంతం నెగ్గించుకుని భార్యను వెంట పెట్టుకుని మావాడు ఇంటికి వచ్చేశాడు.

అంతవరకూ వస్తుందని మా మామయ్య కలలోకూడా అనుకోలేదు. పన్నెండేళ్ళు వెళ్ళిన పసికూన, అమాయకురాలు, ఖర్మం చాలక రజస్వల అయిందికాని సరిగా అవయ పుష్టి అయినా పొందనిది, తన కోడలు శారద రాజేశ్వర్రావు మౌఢ్యానికి ఆహుతి కానుండటం ఆయన సహించలేకపోయినాడు. తన కర్తవ్యం ఏమిటో ఆయన వెంటనే తేల్చుకున్నాడు.

ఆ రాత్రి భోజనానంతరం ఆయన భార్యను, "శారదకు ఎక్కడ పక్క వేస్తున్నావు?" అని అడిగాడు.

"అబ్బాయీ అదీ గదిలో పడుకుంటారు" అన్నదామె.

"నేను?"

"మీరు వసారాలో పడుకోండి."

"వల్లకాదు, నాకు కూడా ఆ గదిలో పక్క వెయ్యి."

"అయితే వాళ్ళో?" అన్నది మా అత్తయ్య ఆశ్చర్యంతో.

"వాళ్ళెవరు?... నీ కొడుకు సంగతి నాకు తెలియదు. శారద గదిలోనే పడుకుంటుంది. నువ్వూ గదిలోనే పడుకుంటావు."

"ఇదేం చోద్యమమ్మా!" అని ప్రారంభించిందావిడ.

ఆ రాత్రి అట్లాగే గడిచింది. రాజేశ్వర్రావు ఏం చెయ్యటానికీ తోచని వాడైనాడు. ఇట్లా వరసగా రెండు రోజులు గడిచిన తరవాత గాని తండ్రితో పోట్లాడటానికి ధైర్యం చాలకపోయింది వాడికి.

"నీ ఉద్దేశం నాకు అర్థం కాలేదు. నేను పెళ్ళాన్ని తెచ్చుకోవటమేమిటీ? దాన్ని పెట్టుకుని నువు గదిలో పడుకోవటం ఏమిటి?" అన్నాడు రాజేశ్వర్రావు తండ్రితో.

"దాని దారిన అదే అర్థమౌతుంది" అన్నాడు తండ్రి.

"అమ్మా, ఇవాళ రాత్రి నువ్వా గదిలో పడుకోకు!" అని కొడుకు తల్లితో రహస్యంగా చెప్పాడు.

ఆ రాత్రి తన భార్య గదిలో పక్క వేసుకోకపోవటం చూసి మా మామయ్య భార్యని కారణం అడిగాడు.

"నాకు ఉక్కగా ఉంది. వసారాలో పడుకుంటాను" అన్నదావిడ.

"సరే, వెళ్ళు!" అన్నాడు మా మామయ్య.

కాని శారదతో చిక్కు వచ్చింది. ఆ పిల్ల గదిలో అడుగు పెట్టటానికే జంకింది. మా మామయ్య ఇవతలికి వచ్చి వసారాలో పక్క వేసుకుంటున్న అత్తగారిదగ్గిర తారట్లాడుతున్న శారదను "లోపలికి వెళ్ళి నీ పక్కమీద పడుకో!" అన్నాడు. శారద కదల్లేదు. అప్పటికి అత్తగారి బోధ కొంత అయింది.

"వెళ్ళు!" అని గద్దించాడు మా మామయ్య. శారద దడుచుకుని పిల్లి మాదిరిగా వెళ్ళింది లోపలికి. ఆ రాత్రి మా మామయ్యా శారదా ఆ గదిలో పడుకున్నారు. ఆ పిల్లకు ఒక రాత్రివేళ అయినా నిద్రపట్టి ఉంటుంది కాని మా మామయ్య రెప్పవాల్చలేదుట.

నేనయితే అటువంటి రాత్రి గడిపిన తరవాత ఎవరెట్లా చస్తే నాకేమని నా దారిన నేను వెళ్ళేవాణ్ణి. మా మామయ్య తీర్మానం రెట్టింపయిందేకాని మరొకటి కాలేదు.

మర్నాడు రాజేశ్వర్రావు తను ఎరిగి ఉన్న అందరితోటీ టమటమా వేసి వచ్చాడు. "నేను నా భార్యను ఏలను! రాత్రి మా నాన్న ఏం చేశాడనుకున్నావు? నా భార్యను పెట్టుకుని ఒంటరిగా గదిలో పడుకున్నాడు!" అని

అందరూ నోళ్ళు తెరుచుకుని విన్నారు. కొందరు ముక్కుమీద వేలు పెట్టుకుని "హరెరెరె!" అన్నారు. "చూశావా?" అన్నారు మరికొందరు. "నిజమే?" అని ఆశ్చర్యపోయినారు ఇంకా కొందరు. ఒక్కడైనా "ఛీ! అప్రాచ్యుడా! నోరు ముయ్యి!" అన్నవాళ్ళు లేరు.

మా మామయ్య ఆ రాత్రంతా గది తలుపు రెక్కలు బార్లా తెరిచే ఉంచాడు!

ఒక్కొక్కరే తను చెప్పింది విని నమ్ముతున్నకొద్దీ రాజేశ్వర్రావుకు నిజంగానే తన తండ్రి ఏదో చేశాడని దృఢమై ఉండాలి. ఎటువంటి అల్లరీ లేకుండా ఆ రాత్రంతా మధ్యాహ్నమంతా గడిపినవాడు సాయంకాలం ఇంటికి వచ్చి తండ్రిని అడ్డమైన మాటలూ అన్నాడు. తన భార్యకూ తండ్రికీ రంకు కట్టాడు. తను భార్యను ఏలుకోబోవటం లేదన్నాడు. తన భాగం పంచిపెట్టమన్నాడు. ఇక ఆయన తనకు తండ్రేకాదు, అయితే అటువంటి పని చెయ్యడన్నాడు.

దానికికూడా మా మామయ్య చక్కని సమాధానం చెప్పాడు. "అవును! నేనీ పని చేస్తున్నది నీ తండ్రిగా కాదు. నేను ఆపగలిగిన పరిస్థితులలో నువు ఆ పసిదానికి రోగాలు తగిలించనివ్వను. ఆ పిల్ల నా కూతురయి ఉండవచ్చును! నీకు కావలసిన భాగం ఇవ్వటానికి – నువ్వడగటానికి – ఇదికాదు సమయం. అంత అర్జంటయితే కోర్టుకు వెళ్ళు!"

"దాని జీవితాన్ని ధ్వంసం చెయ్యటానికి నీకేం అధికారం ఉందీ? దాన్ని రేపు నేనేలకపోతే నువు ఏలుతావా? అది నిన్ను అడిగిందా తన్ను కాపాడమని?" అని వాదించాడు సుపుత్రుడు.

"దానికి నాలుగింతలుంది నా వయసు. దాన్ని అడిగి కనుక్కోకుండా నా విధి నేను నిర్వర్తించలేనా ఏమిటి నీ తాత్పర్యం?" అన్నాడు మా మామయ్య.

ఫలాని పార్వతీశంగారు కోడల్ని ఉంచుకున్నాడనీ, కొడుకును ఇంట్లో నించి వెళ్ళిపొమ్మన్నాడనీ కూడా ఊరంతా పొక్కిపోయింది.

ఎందుకు పొక్కదూ? మా అత్తయ్య, అడగనివారిది పాపంగా, తన కొడుకు తండ్రిమీద చేసిన ప్రచారమే, అందరాడవాళ్ళతోనూ భర్తమీద చెయ్యసాగింది. అందరూ నిజమే ననుకునేటందుకు వీలుగా రాజేశ్వర్రావు ఇంట్లోనించి వెళ్ళిపోయినాడు. తన స్నేహితురాళ్ళ యిళ్ళలో ఆ రోజులు గడిపి ఉంటాడు. ఇందులో కూడా మరీ హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే వాడి తల్లి భర్తకు తెలియకుండా ఇంట్లోనించి డబ్బు తస్కరించి వాడికి ఇస్తూ ఉండేది.

మా మామయ్య ఇట్లా అపఖ్యాతిపాలు కావటం నాకు చాలా కష్టం వేసింది.

"ఏమిటి, మామయ్యా, ఊరంతా ఇట్లా పొక్కిపోతున్నది?" అన్నాను.

"ఇదే సంఘం! నేను నలభై ఏళ్ళనించీ ఉంటున్న ఈ ఊళ్ళో నన్ను నిజంగా ఎరిగినవాడు ఒక్కడూ లేకపోవటం నీకేమైనా ఆశ్చర్యంగా ఉందేమో? నాకు లేదు!" అన్నాడాయన.

"వాడిదారిన వాణ్ణి పోనివ్వరాదూ? నువ్వెందుకు నిష్కారణంగా అపఖ్యాతి పాలుకావాలంటాను?"

"నన్ను ఏ మాత్రమూ ఎరగనివాళ్ళు నన్ను గురించి ఏమనుకుంటే ఏమంటాను? ఇది సాంఘిక సమస్య అని ఒక్కడికికూడా తోచలేదు! ఒక్కడికి? దీన్ని మా అంతఃకలహం కింద భావించారు. కాదూ?"

ఆయనతో తర్కించటం కష్టమే. అయినా, ఆయనమీది అభిమానం చేతనయితేనేమీ, రాజేశ్వర్రావు మీదగల అసహ్యం వల్లనయితేనేమీ మా మామయ్య తన ప్రయత్నం నించి విరమించుకుంటే బాగుంటుందని తోచింది.

"ఒక్క సంగతి గమనించు, మామయ్యా!" అన్నాను. నేను ప్రయోగిస్తున్న అస్త్రానికి తిరుగు ఉండదని లోలోపల గర్విస్తూ "మీవాడు నీ కోడలి శరీరం పాడు చేస్తాడని కద నీ అభ్యంతరం? నువ్వు కోరిన ప్రకారం వాడు ఇప్పటిమట్టుకు ఒళ్ళు బాగు చేయించుకుంటే మాత్రం ఏమయిందీ? వాడేనాడయినా మళ్ళీ రోగాలు తాకించుకుని భార్యకు వాటిని సంక్రమింపజేయ వచ్చును. అసలు మనిషిని నువ్వేమైనా చెయ్యగలవా?"

మా మామయ్య నా అజ్ఞానానికి నవ్వాడు.

"ఎవడైనా నీమీద పగబట్టి ఉన్నాడని తెలుస్తుంది. వాడు నిన్ను యేమీ చెయ్యకుండా శాశ్వతమైన ఏర్పాటు నేను చెయ్యలేని అసమర్థుణ్ణి కావచ్చును. కాని నీ విరోధి సాయుధుడై ఉండటం ఎరిగి నిన్ను వాడికి ఒంటరిగా వప్పజెప్పి నా దారిన నేను బోతే నా సంఘబుద్ధికి నువ్వేమని మెచ్చుకుంటావో ఊహించలేకుండా ఉన్నాను!" అన్నాడు మా మామయ్య. ఆయన కెవరు సమాధానం చెప్పగలరు? నేను ఆయనతో వాదం పెట్టుకుని ఆయన తత్వం అర్థం చేసుకోలేకపోయినానని మాత్రం రుజువు చేసుకున్నాను! అర్థం గాని విషయాలను గురించి కుతర్కం సాగించే నేర్పు ఈ కాలపు విద్యలో ఉందనుకుంటాను.

నేను చిట్టచివరకు "పోనీ, నువ్వు ఎట్లాగయినా గెలుస్తావనే నమ్మకం ఉందా!" అని అడిగాను.

"లేదు! నా ఒక్కడివల్ల ఏమవుతుంది? మావాడు సంవత్సరం పాటయినా నాతో యుద్ధం చేస్తాడు కాని ఒక్క నెల ఓపికపట్టి తన శరీరం బాగుచేసుకుని నా బాధ్యతనించి నన్ను తప్పించడు; నేను అసమర్థుడినై నా కళ్ళఎదుట ఈ అత్యాచారం జరగనిచ్చాననే అవమానం నాకు లేకుండా చెయ్యడు! అందులోనే ఉంది మానవజాతిని పాతాళానికి ఈడుస్తున్న మౌఢ్యమూ మౌర్ఖ్యమూనూ!" అన్నాడాయన.

చివరకు ఆయన అన్నంతా అయింది. శారదను ఇరుగు పొరుగు అమ్మలక్కలు భయపెట్టారు. "మీ మామగారు నిష్కారణంగా నీ గొంతు కోస్తున్నాడు. రేపు నిన్ను నీ భర్త ఏలకపోతే ఆయన అడ్డుపడతాడా? అసలు ఇప్పటికే అంతా మించిపోయిందేమో! వెళ్ళి నీ మొగుడి కాళ్ళ మీదపడు నీ దుంపతెగా!" అని.

శారద వాళ్ళ సలహా ప్రకారమే చేసింది, ఆ పిల్లను భర్త ఇవ్వాళ కూడా దెప్పుతూనే ఉంటాడు. "నువ్వు నాకెందుకే, పీనుగా? మీ మామగారి దగ్గిరికిపో. నేను నిన్ను ఏలనని ఎప్పుడూ చెప్పుతూనే ఉన్నాను!" అని.

"నువ్వు ఏలకపోతే నీ భార్యకు రోగాలు ఎట్లా తగిలినైరా, పశువా?" అని వాణ్ణి అడుగుదామనుకుంటాను. కాని నాకా మాట అడిగేటందుకు సాహసం చాలదు!

*మొదటి ముద్రణ : కారుణ్యం కథల సంపుటి, ఫిబ్రవరి 1937*
*యువ కార్యాలయం, తెనాలి*